# ప్రభాత సూర్యుడు


తెలుగు దినపత్రిక

RANGAREDDY, EDITION : 01, VOLUME :120 EDITOR:CHERUKU UPENDAR, DATE: WEDNESDAY 06 SEPTEMBER 2023 PAGES:4, RATE: Rs.5/-

రంగారెడ్డి సంపుటి : 01 సంచిక : 120 ఎడిటర్ : చెరుకు ఉపేందర్ తేదీ : బుధవారం 06 సెప్టెంబర్ 2023 పేజీలు : 4 వెల : 5/-


## వర్షాలకు మళ్లీ జనజీవనం అస్తవ్యస్తం

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణలో మళ్లీ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టులో కురిసిన వర్షాలతో హైదరాబాద్ సహా తెలంగాణలోని జిల్లాలన్నీ వణికిపోయాయి. వాగులు, వంకలు పొంగాయి. చెరువు కట్టలు తెగిపోయాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. చాలా

మిగతా 2 లో...

## ఎన్నికల గ్రౌండ్‌లో.. బీఆర్ఎస్ అభ్యర్థులు

### గులాబీ నాయకులకు ముందస్తు భారం





వరంగల్- ప్రభాత సూర్యుడు

రాజకీయాలంటే ఖర్చు. అది ఆషామాషీ ఖర్చు కాదు. ఊహించనంత ఖర్చు పెట్టుకోవాలి. అదీ ముందుగానే రంగంలోకి దిగితే ఇక చెప్పాల్సిన పని లేదు. ఇప్పుడు బీఆర్ఎస్ తరపున టిక్కెట్లు పొందిన వారి పరిస్థితి అంతే ఉంది. ఓ వైపు టిక్కెట్లు పొందిన ఆనందం ఉంటే మరో వైపు రోజువారీ ఖర్చులు పెరిగిపోవడం వారిని ఆందోళనకు గురి చేస్తోంది. బీఆర్ఎస్ అభ్యర్థుల తొలి జాబితాను సీఎం కేసీఆర్ ఆగస్టు 21న ప్రకటించారు. అది కూడా ఒకేసారి 115 మంది పేర్లతో కూడిన లిస్టును వెలువరించారు. ఆ జాబితాలో చోటు దక్కిన వారి ఆనందానిక ? అవధుల్లేవు. సీటు దక్కిన వారు వెనువెంటనే రంగంలోకి దిగి, క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని పార్టీ అధినేత ఆదేశించారు. ఇక మూణ్నెల్లపాటు హైదరాబాద్‌లో ఎవరూ ఉండొద్దు.. నియోజకవర్గాలకు వెళ్లండి, జనంతో మమేకం కావాలని ఆదేశిచింది. దీంతో అభ్యర్థులందరూ 'ఎలక్షన్ గ్రౌండ్'కి వెళ్లిపోయారు. కానీ రోజు రోజుకు నేతల్లో ఉత్సాహం తగ్గిపోతోంది. దీనికి కారణం ఖర్చులు . ఎన్నికల కోసం ఇప్పటి నుంచే 'అన్నీ చూసుకోవాలి.. అన్నీ భరించాలి?' అంటే ఖర్చే తడిసిమోపెడవుతుందని ఆవేదన చెందుతున్నారు. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల సమయం అంటే పండగే. వారి కోరికలను అభ్యర్థులు తీర్చాల్సిందే. ఏ మాత్రం కటువుగా మాట్లాడినా, వారు 'అడిగిన దానికి నో

మిగతా 3లో...

## ప్రెసిడెంట్ ఆఫ్ భారత్..

## జీ20 ఇన్విటేషన్‌పై వివాదం




న్యూఢిల్లీ - ప్రభాత సూర్యుడు

జీ20 దేశాల నేతలకు విందు ఇవ్వనున్న నేపథ్యంలో.. ఓ ఇన్విటేషన్ పత్రికపై కొత్తగా ప్రెసిడెంట్ ఆఫ్ భారత్‌అని రాశారు. రాష్ట్రపతి ముర్ము ఇచ్చే ఆ విందు ఆహ్వాన కార్డులో.. ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా బదులుగా.. ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని రాయడం వివాదాస్పదం అవుతోంది. జీ20 మీటింగ్‌కు వివిధ దేశాధినేతలు హాజరవుతున్న ఆ వేడుక సమయంలో.. ఇండియాను

మిగతా 3లో...

## 47 పార్టీలకు

## ఎమ్మెల్సీ కవిత లేఖ



హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు

సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ల బిల్లుపై గట్టిగా పట్టుబడుతున్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అయినా... మహిళా బిల్లును ఆమోదించాలి డిమాండ్ చేస్తున్నారు. అందుకోసం ప్రయత్నాలు కూడా మొదలుపెట్టేశారు. ఇందులో భాగంగా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలకు లేఖ రాశారు ఎమ్మెల్సీ కవిత.

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అయినా

మిగతా 2లో...

## దీర్ఘకాలిక రోగుల కోసం ఆలనా

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు



తెలంగాణ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. పేదలకు మెరుగైన వైద్యం అదించేందుకు ప్రత్యేక చర్యలకు దిగుతోంది. అప్పటికే నూతన ఆస్పత్రులు, అంబులెన్సులు, ల్యాబ్ టెస్టులు ఇలా అనేక సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. దీర్ఘకాల సమస్యలతో బాధపడుతూ జీవిత చరమాంకంలోని రోగులను దగ్గరకు తీసుకునేందుకు కొత్త ప్రణాళికతో ముందకు వచ్చింది. ఆలన కేంద్రాలను వైద్య ఆరోగ్య శాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంట్లో మంచంలోనే ఉండిపోయిన రోగులకు ఆలన కేంద్రాలు అంటే.. పాలేటివ్ కేర్ వరంగా మారుతున్నాయి. ఇలాంటి వారిని కేంద్రాల్లో చేర్పించాలని అధికారులు సూచిస్తున్నారు.తెలంగాణ రెడ్‌హిల్స్ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రిలో 6 పడకలతో ఆలన కేంద్రాలను ఏర్పాటు చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పుడు తాజాగా గడ్డిఅన్నారంలోనూ ఆలన సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది ప్రభుత్వం. ఇక్కడ కూడా ఆరు పడకలను అందుబాటులో ఉంచుతున్నారు. వ్యాధిగ్రస్తులకు ఓపీ, ఐపీ, హోమ్‌కేర్ సర్వీసులను అందిస్తున్నారు. చాలామంది క్యాన్సర్ ఇతర రోగాలతో మంచంలో ఉండిపోయినవారికి తీవ్ర మనోవేదనకు గురవుతుంటారు.ఇంట్లో ఓ వ్యక్తి మంచంలోనే ఉండిపోతే.. ఆ ప్రభావం మిగతా కుటుంబ సభ్యులపై పడుతోంది. ఆర్థిక స్తోమత లేని రోగుల పరిస్థితి దారుణంగా ఉంటోంది. నయం చేయలేని వ్యాధులతో

మిగతా 3లో...

## కోమటిరెడ్డి

## మళ్లీ పక్కచూపులు



నల్గొండ- ప్రభాత సూర్యుడు

కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ లోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఆ వ్యాఖ్యలు ఈ ప్రచారాన్ని బలపరుస్తున్నాయి. 14 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎంపీగా, ఎమ్మెల్సీగా, ఎమ్మెల్యేగా పదవులు అనుభవించిన బీజేపీ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి తనకు రాజకీయ బిక్ష పెట్టిన కాంగ్రెస్ పై ప్రేమ చావడం లేదా? గడిచిన కొద్ది రోజులుగా రాజగోపాల్ రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరతారన్న ప్రచారంలో ఎంతో కొంత నిజం ఉందా? నిజంగానే ఇంకా ఆయన మనిషక్కడ ఉన్నా..

మనసంతా గాంధీ భవన్

మిగతా 2లో...

## రూ.1000 కోట్లకు చేరిన

## శ్రీ వాణి ట్రస్ట్ విరాళాలు




తిరుమల- ప్రభాత సూర్యుడు

హిందూ దేవాలయాలను పరిరక్షించేందుకు టిటిడి చేపట్టిన శ్రీవారి ట్రస్టుకి శ్రీవారి భక్తుల నుండి విశేష స్పందన వస్తుంది.. శ్రీవాణి ట్రస్టును ప్రారంభించిన నాలుగేళ్ళ కాలంలోనే వందల కోట్ల రూపాయల నిధులు ట్రస్ట్ కి చేకూరింది.. అసలు ఇప్పటి వరకూ శ్రీవాణి ట్రస్టుకి ఎన్ని కోట్ల రూపాయలు ఆదాయం వచ్చింది..? శ్రీవాణి ట్రస్టుకి భక్తులు విరాళాలు అందించే నిధులతో టీటీడీ ఏం చేస్తుందంటే..?అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కలియుగ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనార్థం ప్రతినిత్యం దేశ విదేశాల నుండి భక్తులు వివిధ రూపాల్లో తిరుమలకు చేరుకుంటూ ఉంటారు.. ఇలా చేరుకున్న భక్తులు వారి వారి స్తోమతకు తగ్గట్టు స్వామి వారికి కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.. క్షణకాలం పాటు జరిగే శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శన భాగ్యం కోసం కోట్లాది మంది భక్తులు రోజులు, గంటల తరబడి

నిరీక్షించి స్వామి వారి దర్శన భాగ్యం

మిగతా 2లో...

### తెలంగాణాలో రూ. 700 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు

## ముందుకు వచ్చింది నాఫ్కో

హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు




దుబాయిలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన విజయవంతంగా ప్రారంభమైంది. తన పర్యటనలో భాగంగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు కేటీఆర్. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్రానికి భారీ పెట్టబడితో మంత్రి కేటీఆర్ తన పర్యటన ప్రారంభించారు. అగ్నిమాపక సామాగ్రి తయారీలో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన యూఏఈ దిగ్గజ సంస్థ ఔంఈఈఊ కంపెనీ తెలంగాణ రాష్ట్రంలో రూ. 700 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది.ఈ మేరకు మంత్రి కేటీఆర్‌తో కంపెనీ సీఈవో ఖాలిద్ అల్ ఖతిబ్ ప్రతినిధి బృందం సమావేశమైంది. తెలంగాణ రాష్ట్రంలో తమ అగ్నిమాపక సామాగ్రిని తయారు చేయనున్నట్లు సంస్థ తెలిపింది. ఇందులో భాగంగా రూ. 700 కోట్ల భారీ పెట్టుబడిని పెడుతున్నట్లు తెలిపింది. తెలంగాణతోపాటు భారతదేశం విస్తృతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అగ్నిమాపక సామాగ్రి, అగ్నిమాపక సేవల అవసరం భవిష్యత్తులో భారీగా పెరుగుతుందని విశ్వాసం తమకుందని నాఫ్‌కో తెలిపింది. తెలంగాణలో ఏర్పాటు చేయనున్న అగ్నిమాపక సామాగ్రి తయారీ ప్లాంట్ భారతదేశ డిమాండ్‌కు సరిపోతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.దీంతోపాటు తెలంగాణలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌తో కలిసి అంతర్జాతీయ స్థాయి ఫైర్ సేఫ్టీ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలన్న మంత్రి కేటీఆర్

మిగతా 3లో...

## కలవరపెడుతున్న

## కాంగ్రెస్ సెల్ఫ్ డిక్లరేషన్



వరంగల్- ప్రభాత సూర్యుడు

కాంగ్రెస్‌లోని ఆశావహుల్లో సెల్ఫ్ డిక్లరేషన్ టెన్షన్ మొదలైంది. టికెట్ రాకపోతే పక్క పార్టీకి వెళ్లేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పార్టీ పెట్టిన కొత్త రూలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇటీవల కాంగ్రెస్ పార్టీ టికెట్ దరఖాస్తుకు ఓ సెల్ఫ్?

డిక్లరేషన్ ను ప్రకటించింది. 17

మిగతా 2లో...

### రూ.1000 కోట్లకు చేరిన

## శ్రీ వాణి ట్రస్ట్ విరాళాలు

(మొదటిపేజీ తరువాయి)

పొందుతుంటారు.. ఒక్కో సమయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో చాలా మందికి భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం లభించడం చాలా కష్టం కావడంతో శ్రీనివాసుడి దర్శనభాగ్యం చేసుకోకుండానే వెనుతిరుగుతూ ఉంటారు.. ఇందుకోసం భక్తులు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు, బడా పారిశ్రామిక వేత్తల నుండి సిఫార్సు లేఖలు పొంది విఐపి బ్రేక్ దర్శనం ద్వారా స్వామి వారిని దగ్గర నుండి చూసి ఎంత గానో పరవశించి పోతారు.. మరికొందరికి సిఫార్సు లేఖలు లభించక పోవడంతో చాలా మంది ఎంతగానో నిరాశకు గురి అవుతుంటారు.. తమ జీవిత కాలంలో ఒక్కసారి అయినా స్వామి వారిని కనులారా దగ్గర నుండి చూసే భాగ్యం దక్కితే చాలు తమ జన్మ ధన్యమైందని భావిస్తుంటారు.. అయితే ఇలాంటి వారి కోసమే టీటీడీ శ్రీవాణి ట్రస్టుని అందుబాటులోకి తీసుకొచ్చింది.. అయితే టిటిడి తీసుకొచ్చిన శ్రీవాణి ట్రస్టుకు భక్తుల నుండి విశేష ఆదరణ లభిస్తుంది..అయితే ట్రస్ట్ ప్రారంభించిన నాలుగు ఏళ్ళు గడుస్తుంది.. ఈ నాలుగేళ్ళల్లో ఇప్పటి వరకూ 1000 కోట్ల రూపాయలు విరాళంగా అందాయి.. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిటిడి ఛైర్మన్ గా వైవీ.సుబ్బారెడ్డి భాధ్యతలు స్వీకరించారు.. ఈ క్రమంలోనే ఏడుకొండల్లో దళారీ వ్యవస్థను రద్దూ చేసేందుకు తీసుకున్న నిర్ణయంలో భాగంగా ఒ1, ఒ,2, ఒ3 పద్దతిని పూర్తిగా రద్దు చేశారు.. అయితే ఈ విధానం రద్దు చేసిన తర్వాత విఐపి బ్రేక్ దర్శనానికి మరింత డిమాండ్ పెరిగింది.. దీంతో దళారులు తాము చెప్పిందే రేటుగా అమాయకులైన భక్తుల నుండి అధిక మొత్తంలో నగదును ఆర్జిస్తూ దళారుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతూ వచ్చింది.. ఈ క్రమంలోనే 2018లో ప్రారంభించిన శ్రీవాణి ట్రస్టు ద్వారా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు నిర్మాణం, దేవాలయాలకు ధూపధీప నైవేద్యాలకు తోడ్పాటు అందించడలనే లక్ష్యంగా శ్రీ వెంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్ట్ పేరుతో ఉన్న ట్రస్టుని టీటీడీలో అదనపు ఈవోగా ధర్మారెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత శ్రీవాణి ట్రస్టులో కొన్ని మార్పులు తీసుకొచ్చారు..సనాతన ధర్మంను సంరక్షణలో భాగంగా 2019 అక్టోబర్ 21వ తేదీ నుండి శ్రీవాణికి రూ.10,000 విరాళం ఇచ్చిన దాతలకు ప్రివిలేజ్ క్రింద 500 రూపాయల విలువ గల ఒక సారి విఐపి బ్రేక్ దర్శనాన్ని టిటిడి కల్పించింది.. టిటిడి చేపట్టిన బృహత్తర కార్యక్రమంకు నిధులు వెల్లువెత్తాయి.. 2019లో రూ.26.25 కోట్లు విరాళంగా అందించి 19,737 మంది దర్శించుకున్నారు.. 2020లో రూ. 70.21 కోట్లు విరాళం రాగా, 49,282 మంది భక్తులు దర్శించుకున్నారు.. 2021లో రూ. 176 కోట్లు విరాళంగా రాగా, 1,31,000 మంది భక్తులు దర్శించుకున్నారు.. 2022లో రూ. 282.64 కోట్లు విరాళంగా రాగా 2.70 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.. 2023లో ఇప్పటీ వరకు రూ. 268.35 కోట్లు విరాళాలు రాగా,1.58 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. నాలుగేళ్ల కాలంలోనే రూ.1000 కోట్లు విరాళం అందాయి. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో 176 పురాతన ఆలయాల పునఃరుద్ధరణ పనులను టిటిడి ప్రారంభించింది.. బీసీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలో 2273 నూతన ఆలయాల నిర్మాణాలు ప్రారంభించడంతో పాటుగా 501 ఆలయాలకు ధూపధీప నైవేథ్యం కింద ప్రతి నెల రూ.5 వేల చొప్పున టిటిడి చెల్లిస్తుంది.. వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శ్రీవాణి ట్రస్ట్ నిధుల వినియోగంపై గత పాలకమండలి అధ్యక్షుడు వైవీ.సుబ్బారెడ్డి 2023 జూన్ 23 తేదీన శ్వేతపత్రాన్ని విడుదల చేశారు..

### వర్షాలకు మళ్లీ

## జనజీవనం అస్తవ్యస్థం

(మొదటిపేజీ తరువాయి)

ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు వరదలో కొట్టుకుపోయారు. ఈ బీభత్సం మరువకముందే.. మళ్లీ రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ జనజీవనం అస్తవ్యస్థంగా మారింది. ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎడతెరపి లేని వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఆ జిల్లాలో వాగులు వకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్టులకు కూడా నిండిపోయాయి. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు కూడా వరద పోటెత్తింది. ప్రస్తుతం శ్రీరాం సాగర్ ప్రాజెక్టుకు 75వేల 100 క్యూసెక్కుల ఇన్ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టు నిండుకుండను తలపిస్తోంది. వరద అంతకంతకూ పెరుగుతుండటంతో.. ఇరిగేషన్ అధికారులు అప్రమత్త మయ్యారు. 16 గేట్లు ఎత్తి 64వేల 38 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో మొత్తం 90 టీఎంసీల నీటిని నిల్వ ఉంచవచ్చు. అయితే పెద్దఎత్తున వరద వస్తుండటంతో ప్రాజెక్టు ఫుల్ అయ్యింది. దీంతో గేట్లు ఎత్తక తప్పలేదు. ఇక, జిల్లాలోని మరో జలాశయమైన రామడుగు ప్రాజెక్టులో కూడా వరద పెరుగుతోంది. 12వేల 285 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటంతో... రామడుగు ప్రాజెక్టులో నీటిమట్ట 1278.3 అడుగులకు చేరింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రాజెక్టు అన్నింటిది ఇదే పరిస్థితి.

ఏ జలశాయం చూసినా.. జలకళతో కళకళలాడుతోంది. కామారెడ్డి జిల్లాలోని నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 29వేల 800 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులో నాలుగు గేట్లు ఎత్తారు అధికారులు. నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 17.8 టీఎంసీలు కాగా... ప్రస్తుతం 17 టీఎంసీలకు చేరింది.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు జనజీవనం కూడా అస్థవ్యక్తంగా మారింది. పలు మండలాల్లో భారీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. కామారెడ్డి జిల్లాలోని గాంధారిలో 14.4 సెంటీమీటర్లు, కామారెడ్డిలో 9.9, నాగిరెడ్డిపల్లిలో 9.1 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో జుక్కల్– బస్వాపూర్ మధ్య వాగు ఉధృతంగా ప్రవహి స్తున్నది. దీంతో రోడ్డు కొట్టుకుపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. వాగులు– వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో.. పలు ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కొన్ని చోట్ల రహదారులపై కూడా వరద ప్రవహరిస్తోంది. ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండటంతో... ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మరో కొన్ని రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో.. అలర్ట్‌గా ఉండాలని హెచ్చరిం చింది. జిల్లా యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉంది. అనుకోని సంఘటనలు జరిగితే... వెంటనే సహాయకచర్యలు చేపట్టేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉంది. ఇన్ని రోజులు ఉక్క ఉక్కిరిబిక్కిరి అయిన హైదరాబాద్ వాసులను ఇప్పుడు వానలు తడిసి ముద్ద అయ్యేలా చేస్తున్నాయి. ఆదివారం రాత్రి మొదలైన వర్షాలు ఇంకా వదలడం లేదు. ముసురులా పట్టుకుంది. వేకువజాము నుంచే మరింత ఉధృతంగా కురుస్తుంది.

#### రాత్రి నుంచి వానే వాన

రెండు రోజుల నుంచి భారీగా కురుస్తున్న వర్షానికి హైదరా?బాద్‌లోని చాలా లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లన్నీ నీటితో నిండిపోయాయి. అధికారులు అప్రమత్తమై నీటి నిల్వలేకుండా చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. సమస్య ఉంటే వెంటనే జీహెచ్ఎంసీ హెల్ప్‌లైన్ నెంబర్ 040–21111111కు లేదా 100కు, 90001 13667కు ఫోన్ చేయాలని అధికారులు చెబుతున్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఎవరూ బయటకు రావద్దని సూచిస్తున్నారు. వర్షాలు కారణంగా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ పరిధిలోని స్కూల్స్‌కు సెలవులు ప్రకటిస్తున్నట్టు విద్యా శాఖ ప్రకటించింది. అలాంటి ఇలాంటి వాన కాదు. కుండలతో పోసినట్టు కురుస్తోంది. అక్కడా ఇక్కడా కాదు హైదరాబాద్ మొత్తంగా కురుస్తోంది. జనం ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. అర్ధరాత్రి నుంచి పడుతున్న వాన జనజీవనాన్ని స్తంభింప జేసింది. ఉదయాన్నే ఆఫీసుకు వెళ్లే వారు అష్టకష్టాలు పడుతున్నారు. ఆన్‌లైన్‌లో ఆటోలు, క్యాబ్‌లు బుక్ కావడం లేదు. బుక్ అయినా ఛార్జీల మోత మోగిస్తున్నారు. ఆఫ్‌లైన్‌లో కూడా భారీగా వసూలు చేస్తున్నారు. రెగ్యులర్‌గా వసూలు చేసే ఛార్జీల నాలుగైదు రెట్లు డిమాండ్ చేస్తున్నారు. మెట్రో అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఉద్యోగులు వ్యయ ప్రయాసలు కోర్చి ఆఫీసులకు చేరుకుంటున్నారు. మిగతా వారి పరిస్థితి వర్ణించడానికి మాటలు చాలవు అన్నట్టు ఉంది.

సొంత వాహనాలు ఉన్న వారిది మరో కష్టం. రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి.ఎక్కడికక్కడ నిలిచిపోయిన నీటిలో ప్రయాణం ప్రమాదం అని తెలిసినా తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్తున్నారు. కొందరు తడుస్తూనే ఆఫీసులకు చేరుకుంటున్నారు. ఎక్కడ ఏ రోడ్డు తెగి ఉంటుందో, ఏ మ్యాన్ హోల్ నోరు తెరిచి ఉందో అన్న భయంతోనే వాహనాలు డ్రైవ్ చేస్తు న్నారు. పరిస్థితి గమనించిన వాతావరణ శాఖ హైదరాబాద్ ప్రజలకు హెచ్చరిక జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచిస్తోంది. ఈ రోజంతా భారీ వర్షాలకు ఛాన్స్ ఉందని చెబుతోంది. భారీగా పడుతున్న వర్షంతో పలు ప్రాంతాల్లో ఇళ్లు నీట మునిగాయి. మరికొన్ని ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్ సెల్లార్లలోకి నీళ్లు చేరాయి. జీడిమెట్ల, మారేడుపల్లి, ఎల్బీనగర్, సాగర్ రింగ్‌రోడ్డు, హస్తినాపురం, నిజాం పేట, అల్విన్ కాలనీ, చిలకలగూడ, సికింద్రాబాద్, సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, ప్రగతీనగర్, కూకట్‌పల్లి, అడ్డగుట్ట, కంటోన్మెంట్, బోయినపల్లి, కర్మానా, మెహదీపట్నం, టోలీచౌకి, షేక్‌పేట, మాదాపూర్, హైటెక్‌సిటీ, కొండాపూర్, మెట్టుగూడ, తార్నాక, ఉప్పల్, కోఠఈ, మలక్‌పేట, దిల్‌షుక్‌నగర్ ఇలా అన్ని ప్రాంతాల్లో వర్షం దంచి కొడుతోంది.

### కలవరపెడుతున్న

## కాంగ్రెస్ సెల్ఫ్ డిక్లరేషన్

(మొదటిపేజీ తరువాయి)

కీలక అంశాలను అందులో పొందుపరిచింది. 'రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించకపోతే.. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా నామినేషన్ దాఖలు చేయను' అనే నిబంధన డిక్లరేషన్ లో కీలకంగా మారింది. పార్టీకి లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారు. మరి పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే హైకమాండ్ నుంచి ఎలాంటి చర్యలు ఉంటాయోనని చాలామంది నేతలు మదన పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగినందునే 119 నియోజకవర్గాలకు 1006 అప్లికేషన్లు వచ్చినట్లు పార్టీ వర్గాలు స్పష్టం చేశాయి. ఒక్కో సెగ్మెంట్ కు సగటున 8 నుంచి 9 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. దీంతో అభ్యర్థుల ఎంపిక కూడా ప్రదేశ్ ఎన్నికల కమిటీ, స్క్రీనింగ్ కమిటీలకు సవాల్ గా మారింది. సీనియర్లు, మాజీ ఎమ్మెల్యేలకు రూట్ క్లియర్ అయినా చాలాకాలంగా ఎదురు చూస్తున్నవారు, కొత్తవాళ్లకు ఇబ్బందికర పరిస్థితి ఉంది.జనాల్లో తిరుగుతూనే, టీపీసీసీ, ఏఐసీసీ నేతలను ప్రసన్నం చేసే పనిలోనూ కొందరు నేతలు నిమగ్నమ య్యారు. అయితే టికెట్ రాకపోతే పక్క పార్టీలోకి దూకాలని చూసే నేతలూ ఉన్నారు. రూల్స్ బ్రేక్ చేస్తే పార్టీ నిర్ణయం ఎలా ఉండవచ్చు..? లీగల్ సమస్యలు తలెత్తుతాయా? ఎలాంటి స్టెప్ తీసుకోవచ్చు..? అంటూ చాలామంది లీగల్ అడ్వయిజర్ల సలహాలు తీసుకోవడం గమనార్హం. నిబంధనల మేరకే పొందుపరిచారా? లేదా సెల్ఫ్ డిక్లరేషన్ ను స్ట్రిక్ట్ గా అమలు చేస్తారా అనేది త్వరలో తేలనున్నది.

#### దరఖాస్తులోని అంశాలు ఇవే..

- మానవ, స్త్రీల గౌరవాన్ని నిలబెడతాను. శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని ప్రోత్సహిస్తాను.
- మహిళల పట్ల వివక్ష నిర్మూలన కోసం కృషి చేస్తాను.
- ఎన్నికల తేదీ నుంచి 3 నెలల వ్యవధిలో ఆస్తి రిటర్నులను, ప్రతి ఏడాది ఆస్తులు తదితర వివరాలను సమర్పిస్తాను.
- బలహీన వర్గాలకు ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాలను నిర్వహిస్తాను.
- అల్లర్లు లేదా ప్రకృతి వైపరీత్యాల నుంచి ప్రజలను కాపాడడానికి సహాయం అందిస్తాను.
- కాంగ్రెస్ కార్యకర్తగా విధులను నిర్వర్తించడంలో వ్యక్తిగత ప్రయోజనాలను మినహాయిస్తాను. ప్రజా, జాతీయ ప్రయోజనాలను ప్రోత్సహిస్తాను.
- ఏ క్రిమినల్ ఎలిమెంట్ తోనూ సంబంధాన్ని కలిగి ఉండను.
- పన్నులు, ప్రభుత్వం పార్టీకి అందించాల్సిన బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లిస్తాను.
- ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తాను.
- జాతీయ సమైక్యత, సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహించే అన్ని వర్గాల ప్రధాన పండుగల్లో పాల్గొంటాను.
- సంపద అతి ప్రదర్శనకు దూరంగా ఉంటాను.
- కట్నం తీసుకోను, ఇవ్వను.
- కాంగ్రెస్ అధ్యక్షుడు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం తప్ప, పార్టీ తరపున నిధులను సేకరించను.
- ప్రజలను కలిసేందుకు వెళ్లేప్పుడు పీసీసీ, డీసీసీకి సమాచారం ఇస్తాను.
- పార్టీ విధానాలు, కార్యక్రమాలు, ఇతర పార్టీ సభ్యుల పరువు, ప్రతిష్టను తగ్గించే విధంగా బహిరంగంగా విమర్శించను.
- కుల, మత, ఆధారిత రాజకీయ సంస్థలతో అనుబంధం కలిగి ఉండను.
- పార్టీ నన్ను ఎన్నికల్లో అభ్యర్థిగా ప్రకటించని పక్షంలో, పార్టీకి వ్యతిరేకంగా నామినేషన్ దాఖలు చేయనని డిక్లేర్ చేస్తున్నాను.

## 47 పార్టీలకు ఎమ్మెల్సీ కవిత లేఖ

(మొదటిపేజీ తరువాయి)

మహిళా బిల్లును ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాలని రాజకీయ పార్టీలను కోరారామె. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి... రానున్న కాలంలో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీతోపాటు 47 రాజకీయ పార్టీల అధ్యక్షులకు లేఖ రాశారు కవిత. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం మద్దతు పలకాలని కోరారు. మహిళా బిల్లు చారిత్రక అవసరమని, చట్టసభల్లో సరిపడా మహిళల ప్రాతినిధ్యం ఉంటేనే.. దేశం పురోగమిస్తుందని లేఖలో ఆమె అభిప్రాయపడ్డారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం సీట్లను మహిళలకు కేటాయించాలని కోరారు. లింగ సమానత్వం, సమ్మిళిత పాలనకు మహిళా బిల్లు చాలా కీలకమని.. అయినా, ఆ బిల్లు చాలా కాలం పాటు పెండింగ్‌లో ఉండిపో యిందన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళా ప్రాతినిధ్యాన్ని పెంచడం చాలా ముఖ్యమన్నారు. దేశ జనాభాలో 50 శాతం వరకు మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారన్న కవిత.. చట్ట సభల్లో మాత్రం మహిళలకు ఓటు లభించడం లేదని అన్నారు. అందుకే అందరం కలిసి మహిళా బిల్లు కోసం పట్టుబట్టాలన్నారు. అన్ని పార్టీలు కలిసి వస్తేనే.. కేంద్రం దిగివస్తుందన్నారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాలలో మహిళా బిల్లుపై అందరు కలసి కట్టుగా ఒత్తిడి పెంచాలని కోరారు కవిత. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, తమిళనాడు సీఎం, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్, ఔఅఖ చీఫ్ శరద్ పవార్, ంఎఅఅ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఏపీ సీఎం, జూఅఖ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోపాటు దేశంలోని పలు రాజకీయ పార్టీల అధ్యక్షులకు తెలంగాణ సీఎం కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత లేఖ రాశారు.

## కోమటిరెడ్డి మళ్లీ పక్కచూపులు

(మొదటిపేజీ తరువాయి)

చుట్టే పరిభ్రమిస్తోందా? రాజగోపాల్ రెడ్డి అభిప్రాయాలు, ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం ఇస్తున్నాయి. అంటే రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారన్న మాటలను కొట్టిపారేయ లేమంటున్నారు విశ్లేషకులు. కాంట్రాక్టర్ అయిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి 2009 ఎన్నికల సమయంలోనే రాజకీయ అరంగేట్రం చేశారు. తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అప్పటికే వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలోనే రాజగోపాల్ రెడ్డి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం వేదికగా రాజకీయాల్లో అడుగుపెట్టారు. కొన్నాళ్లకే వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణంతో రాష్ట్రంలో రాజకీయం పూర్తిగా మారిపోయింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. ఆ సమయంలో కాంగ్రెస్ ఎంపీగా ఉన్న రాజగోపాల్ రెడ్డి సహా కాంగ్రెస్ ఎంపీలంతా ఈ ఉద్యమంలో భాగస్వామ్యం అయ్యారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన 2014 పార్లమెంటు ఎన్నికల్లో రాజగోపాల్ రెడ్డి తిరిగి భువనగిరి నుంచే కాంగ్రెస్ టికెట్ పై పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కానీ కొన్నాళ్లకే జరిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా శాసనమండలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 2018 శాసనసభ ఎన్నికల్లో మునుగోడు నుంచి కాంగ్రెస్ టికెట్ పై ఎమ్మెల్యేగా విజయం సాధించారు. కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత పదవి కోసం కూడా లాబీయింగ్ చేసినా.. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రాజగోపాల్ రెడ్డి అభ్యర్థనను పక్కన పెట్టి భట్టి విక్రమార్కను ఆ పదవికి ఎంపిక చేశారు.ఇక, తాను ఖాళీ చేసిన ఎమ్మెల్సీ స్థానం నుంచి తన భార్య కోమటిరెడ్డి లక్ష్మిని పోటీకి పెట్టి చేతులు కాల్చుకున్నారు రాజగోపాల్ రెడ్డి. టీపీసీసీ చీఫ్ గా ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పదవీకాలం ముగియడంతో పీసీసీ అధ్యక్ష పదవి కోసం రాజగోపాల్ రెడ్డి ప్రయత్నించి విఫలమయ్యారు. రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్ గా ఎంపికైన నాటి నుంచి పార్టీకి అంటీముట్టనట్లు వ్యవహరించారు రాజగోపాల్ రెడ్డి. మరో వైపు తన నియోజవకర్గంలో ఎలాంటి డెవలప్ మెంట్ పనులు చేయలేకపోతున్నాని, సీఎం కేసీఆర్ మీద కారాలు మిరియాలు నూరి, బీజేపీకి దగ్గరయ్యారు. కాంగ్రెస్ నాయకత్వ తప్పులను ఎత్తి చూపుతూ సీఎం కేసీఆర్ ను కంట్రోల్ చేయగలిగేది కేంద్రంలో ఉన్న బీజేపీ ఒక్కటే అని కాంగ్రెస్ కు రాజీనామా చేసి, బీజేపీ కండువా కప్పుకున్నారు. మునుగోడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, ఉప ఎన్నికకు కారణమయ్యారు. ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటికి దిగి ఓటమి పాలయ్యారు. అప్పటి నుంచి ఆయన బీజేపీ కార్యక్రమాలకూ దాదాపుగా దూరంగానే ఉంటున్నారు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో బీజేపీ పరాజయాన్ని మూటగట్టుకుంది. ఆ రాష్ట్రంలో బీజేపీ అధికారం కోల్పోయి కాంగ్రెస్ కు అప్పజెప్పాల్సి వచ్చింది. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం తెలంగాణ కాంగ్రెస్ లో జోష్ నింపింది. తెలంగాణలో బీజేపీ ఇక పుంజుకోలేదేమోన్న అభిప్రాయం బలపడిన నేపథ్యంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పార్టీ మారతారని, బీజేపీని వీడి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరుతారని ప్రచారం ఊపందుకుంది. ఈలోగా రాష్ట్ర బీజేపీ సారథి కూడా మారి బండి సంజయ్ స్థానంలో కేంద్ర మంత్రిగా ఉన్న జి.కిషన్ రెడ్డి రావడం చకచకా జరిగిపోయిన పరిణామాలు. పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందన్న అభిప్రాయంలో ఉన్న కోమటిరెడ్డికి బీజేపీ జాతీయ కార్యవర్గంలో స్థానం కల్పించినా ఆయన పెద్దగా కార్యక్రమాల్లో పాల్గొనలేదు. కానీ రెండు రోజుల కిందట నల్లగొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ తరుణ్ చుగ్ సమక్షంలో జరిగిన నియోజవర్గస్థాయి సమావేశాలకు హాజరయ్యారు. కేసీఆర్ పై నిప్పులు కురిపించారు.ఇంత చేసినా.. రాజగోపాల్ రెడ్డి మనసంతా కాంగ్రెస్ పైనే ఉందన్న సంకేతాలు ఇవ్వకనే ఇచ్చారు. తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పై వ్యతిరేకలేదని, ఇప్పటికీ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే తనకు ప్రేమ, అభిమానం ఉన్నాయని కుండ బద్దలు కొట్టారు. కాంగ్రెస్ కు వెళుతున్నారన్న వార్తలను ఖండిచకపోగా, భవిష్యత్ లో ఏం జరుగుతుందో చూద్దామని సమాధానం ఇచ్చారు. ఇప్పటికీ తన అభిమానుల నుంచి, పాత సహచరుల నుంచి తనను కాంగ్రెస్ లోకి రావాలని ఆహ్వానాలు అందుతున్నాయని చెప్పుకుంటున్నారు. మరి, రాజగోపాల్ రెడ్డి చివరికంటా బీజేపీలోనే కొనసాగుతారా? ఏదో నిమిషయంలో కాంగ్రెస్ బాట పడతారా? అన్న అంశాలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి విషయంలో మాత్రమే ప్రతికూలంగా మాట్లాడుతున్న రాజగోపాల్ రెడ్డి భవిష్యత్ లో ఏం జరుగుతుందో చూద్దామంటున్నారంటే ఆయన కాంగ్రెస్ లో చేరే అవకాశాలు కొట్టిపారేయలేమన్న అభిప్రాయం రాజకీయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

## సంపాదకీయం

# పాన్ ఇండియా పేరుతో భారీ ఖర్చు

వర్తమాన సాంకేతిక విప్లవం అరచేతిలో ఇమిడిపోయింది. చేతి వ్రేళ్ళ చివరి నుంచి 'ప్రపంచ సినిమా' కళ్ళ ముందు సంపూర్ణమైన విశ్లేషణలతో ప్రత్యక్షమవుతుంది. నాసిరకం కథ, స్క్రీన్ ప్లేలను సగటు ప్రేక్షకుడు అంగీకరించడం లేదు. ప్రతీ నిర్మాత దర్శకులు తమ చిత్రం గొప్పదిగానే చెబుతారు ప్రచారం చేసుకుంటారు. కానీ.. వీటిని నమ్మే దశలో ప్రేక్షకులు లేరు. ఈ నేపథ్యం నుంచి ఓ రెండు వందల చిత్రాలు ఈ మధ్యకాలంలో ప్రేక్షకుల 'మెప్పు' కోసం విడుదలైనాయి. ఓ పది సినిమాలు కూడా పట్టుమని పది రోజులు ఆడలేదు. ఒకట్రెండు సినిమా వాల్ పోస్టర్స్ మీద మాత్రమే మూడవ వారమనే ప్రింటు చూస్తున్నాము.'సినిమా అనేది కోట్ల మీద వ్యాపారం. కానీ.. మాటల మీద వ్యాపారం కాదు. మరి దానిని అనుకున్న బడ్జెట్‌లో ఎలా పూర్తి చేయాలో, ఎంత నిష్కర్షగా, నిక్కచ్చిగా ఉండాలో నిర్మాత ప్రణాళిక వేసుకోవాలి. మిగిలిన సాంకేతిక నిపుణులకు అతడే మార్గదర్శి' అంటారు కె.వి. రెడ్డి. ఆయన తన చేతిలో ఉన్న స్క్రిప్ట్ తోనే బడ్జెట్ అంకెలను సహితం పేర్కొనే వారని చెప్పేవారు ఉన్నారు. బ్యాండ్ స్క్రిప్ట్ చేతిలో లేకుండా షూటింగ్‌కు వెళ్లేవారు కాదు. ఆనాటి దర్శక నిర్మాతలు, కృష్ణ 'అల్లూరి సీతారామరాజు' చిత్రానికి సహితం రచయిత మహారథి స్క్రిప్ట్, సంభాషణలు వంటి వాటి పట్ల నిబద్ధమైన సంప్రదింపులు జరిపారని ఆయనే చాలా సందర్భాలలో చెప్పారు. పూర్తిస్థాయిలో, కొన్ని వందల మందితో, అడవిలో షూటింగ్ చేసుకున్న ఆ చిత్రం 'బడ్జెట్' అంచనాలను దాటి పోలేదు. ప్రముఖ నటులంతా అందులో ఉన్నారు. ఇందుకు కారణం ఆ చిత్ర నిర్మాతలుగా వ్యవహరించిన ఆది శేషగిరిరావు, హనుమంతరావులేనని అంటారు సూపర్ స్టార్. ఆ చిత్రం ఓ చరిత్ర. ఇది గతం.

గత వర్తమానాలు బేరీజు వేసుకుంటే సినిమా నిర్మాణం అనేది 'కొంతమంది' చేతిలోకి వెళ్లిపోయింది. వారు కూడా చిత్ర ఫలితాలు తారుమారైతే 'నష్టపోయిన' సందర్భాలున్నాయి. కానీ.. థియేటర్లు, పంపిణీ, రాజకీయ, సామాజిక, సాంకేతిక సమీకరణాల వలన తక్కువ నష్టాలతో ఒడ్డున పడుతున్నారు. నటీనటుల కాంబినేషన్స్‌లో క్రేజీ ప్రాజెక్టును పట్టాలెక్కించి, పాపులర్ అయిన వారున్నారు. కర్ణుడి చావుకు లక్ష కారణాలు అని చెప్పడంలో ఇటువంటి అంశాలున్నాయి. బడ్జెట్‌ను ఎవరు అదుపు చేస్తారనేది వర్తమాన చిత్ర పరిశ్రమలో మిలియన్ డాలర్ల ప్రశ్న. తారల రేట్లు విపరీతంగా పెంచుకుపోతున్నారు.కానీ.. చిత్రం ఫలితం గల్లంతయితే నిర్మాతలకు కనీసం పెట్టుబడి కూడా రావడం లేదు. అలాగని చిన్న చిత్రాలు తీసే వారికి థియేటర్లు దొరకని స్థితి. ఓ సిండికేట్ వ్యవస్థ నియంత్రత్వమే దీనికి కారణమని ఒక వాదన. నిజానిజాలు పక్కన పెడితే విపరీతమైన ప్రచారం చేస్తున్న హైప్ మొదటి ఆటతోనే 'తుస్సు'మంటున్నది. అంతే రెండో ఆట నుంచి టికెట్లు తెగటం నెమ్మదిస్తుంది. ఇందుకు ఉదాహరణగా ఈ మధ్య కాలంలో విడుదలైన 'కొన్ని' చిత్రాలను చెప్పుకోవచ్చు. నిర్మాతల నష్టాన్ని భర్తీ చేసే నటులు ఇద్దరు, ముగ్గురు అటు తమిళ, ఇటు తెలుగు పరిశ్రమలో ఉన్నారు. వారికి 'నిర్మాతల' సంక్షేమం, జీవితాలు గురించి తెలుసు. వారు కూడా నిర్మాణ రంగంలోనికి దిగి చేయి కాల్చుకోవడం అందరికీ తెలిసిందే.ఓటీటీల ప్రభావం చిత్ర పరిశ్రమ మీద ఎక్కువ అనేది ఎవరూ అంగీకరించవలసినఅంశం. కానీ.. తెరపైన సినిమాని ఇది శాసిస్తుంది. కరోనా సమయంలో దీని విశ్వరూప సందర్శన పరమార్ధం అందరికీ అర్థమైంది. దానికి ఎడిక్ట్ అయిపోయారు. 'చిత్రాల విజయాలను శాసిస్తున్నది థియేటర్లలోని పాప్ కార్న్ కూడా'నని దర్శకుడు తేజ చెప్పిన మాటలను కొట్టిపారేయలేం. థియేటర్ యాజమాన్యం, షాపు ఓనరు కలిపి పది రూపాయల పాప్ కార్నును వందకు పెంచేసి, ప్రేక్షకులు జేబుకు చిల్లు పెడుతున్నారు. నలుగురు కుటుంబ సభ్యులతో సినిమా థియేటర్‌కు వెళ్లిన వారికి మినిమం ఇంటర్వల్ ఖర్చు వెయ్యికి పైనే? ఈ పరిస్థితుల్లో స్నేహితులు, కుటుంబాలతో సరదాగా కలిసి సినిమా చూసి అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయనే చెప్పాలి. "తారల పారితోషకాలు ఎందుకు పెరుగుతున్నాయనేది, దాని వలన చిత్ర ఫలితాలు, తదనంతర కాలంలో నిర్మాణం, డిస్ట్రిబ్యూషన్, కార్మికులు, నిర్మాత, దర్శకులు వంటి ఇరవై నాలుగు విభాగాల వారు ఏమవుతారో, వారి భవితవ్యం ఏమిటో కూడా చిత్ర పరిశ్రమకు ఆలోచిస్తున్నట్టు లేదు. చిత్ర సీమలో నిబద్ధత లేదని చాటుకుంటున్నామోననే అపవాదు ఉంద"ని సుందర లాల్ నహతా ఆరున్నర దశాబ్దాల క్రితం చేసిన వ్యాఖ్యానం. వెరసి అటు సాంకేతికత, ఇటు పరిశ్రమ పరమైన 'స్వంత లాభం' వంటివి ప్రేక్షకులపైన భారంగా పడుతున్నాయి. క్రమేపీ సినిమాను పెద్ద తెరపై చూసి ఆనందించే స్థాయిని దూరం చేస్తున్నాయి.ఒకనాడు ఇసుక నేలలో సింగిల్ ప్రాజెక్టుపై 'పాత ఎన్టీవోడు, అక్కినేని వోడు' సినిమాలను చూసే క్రింది వర్గానికి 'ధరల మెట్లు' దిగువ స్థాయికి చేర్చేసాయి. సెల్ ఫోన్‌లో అక్రమంగా చిత్రాన్ని చూసుకునే అవకాశమిస్తున్నాయి. 'సినిమాలోని లాజిక్‌ను పట్టించుకోకుండా సరదాగా మూడు గంటల సినిమా చూడాలనుకునే వాడికి 'మాల్' లోని థియేటర్లు సహకరించే స్థితి లేదు. అందరూ కలిసి ఇంట్లో ఓటీటీలో చూసుకుంటున్నారు. నష్టం లేని పని కుటుంబ సభ్యులంతా ఖర్చు లేకుండా చూస్తున్నారు. ఈ నిర్ణయం సగటు ప్రేక్షకుడు ఎందుకు తీసుకుంటున్నాడు? ఆలోచించేది ఎవరు? వంద సినిమాలకు కనీసం పది సినిమాలైనా పెట్టుబడి వచ్చేటట్టు చేసుకునేది ఎవరు? కోట్లు పెట్టేవాడు కోట్లు లాభం ఆశించడం తప్పు కాదు. కానీ.. వాటిని తెచ్చుకునే పథకం కూడా తెలియాలి. ఆ దిశగా ఆలోచించుకోవాలి.ప్రొడక్షన్ కాస్ట్ పెరిగిందనేది తరచుగా వినపడే మాట. అసలు పోస్ట్ ప్రొడక్షను, ప్రీ ప్రొడక్షన్ సమయాలలో ఎటువంటి కార్యక్రమాలు ఉంటాయి. ఏయే విభాగంలో ఈ రెంటి మధ్య సమన్వయం, అవసరం ఉంటాయో ఎంతమంది క్రొత్త నిర్మాతలకు తెలుసు అనేది సందేహం. ప్రాథమికమైన అవగాహన లేమితో కేవలం 'డబ్బుందనే' కారణంగా 'ఆశ'తో చిత్ర నిర్మాణం కొనసాగించి మధ్యలో చతికిలబడిన వారు, ల్యాబ్‌లలో ప్రింట్లు వదిలేసుకున్నవారు సినిమా చరిత్రలో ఎందరెందరో మరి. 'ఒక్క అవకాశం అని' వెళ్ళి, చివరకు బతుకులో కనీసం 'ఒక్క ఛాన్స్' కూడా లేకుండా పోయినవారు పరిశ్రమలో ఉన్నారు. మురళీమోహన్ లాంటివారు అన్ని విభాగాలపై పట్టు, చిత్ర పరిశ్రమలోని లోగోట్టు తెలిసిన తరువాతనే క్రమశిక్షణతో, ఆర్థికపరమైన పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లారు. చిత్రాలు తీశారు. విజయవంతమైనారు. నాటి విజయ, భరణి, సురేష్ బాబు మూవీస్, కౌముది, ఎన్.ఎ.టి., అమృత వంటి బ్యానర్లు క్రమశిక్షణతోనే విజయాలకు చిరునామాగా మిగిలాయి. వారు నడిచిన మార్గాలు, పాటించిన నైతిక సూత్రాలు తెలుసుకునే వారేరి?

# ట్రాన్స్ జెండర్స్ ఓటు హక్కు వినియోగించుకోవాలి

## జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా




**జగిత్యాల - ప్రభాత సూర్యుడు :** ఓటు హక్కు వినియోగించుకునేందుకుట్రాన్స్ జెండర్స్ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో మనకోసం మన భవిష్యత్తు కోసం నిజమైన నాయకుడిని ఎన్నుకోవాలంటే ఓటు హక్కు నమోదు తో పాటు ఆ హక్కును వినియోగించుకోవడం తప్పనిసరి అని కలెక్టర్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ ఓటు అవగాహన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో ట్రాంజెండర్లకు ఓటర్ అవగాహన కల్పించి ఓటు హక్కు లేని వారికి ఓటు నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ తో జిల్లా కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఓటు ప్రక్రియలో పురుషులు మహిళతో పాటు మూడవ జెండర్ కింద నమోదుకు అవకాశం కల్పించడం జరిగిందని వెల్లడించారు. జిల్లాలోని ట్రాన్స్ జెండర్స్ అందరూ ఓటు నమోదు, వివరాలు మార్పు కై దరఖాస్తు చేసుకుని ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ట్రాంజెండర్ల ప్రతినిధులు నిహారిక, ప్రశాంతి లను ఓటర్ అవగాహన కార్యక్రమాల విస్తరణకు ప్రచార కార్యకర్తలుగా ఎంపికయ్యారు. ట్రాన్స్ జెండర్లలను గుర్తించి ఓటరు నమోదు లో అవకాశం కల్పించిన కల్పించినందుకు భారత ఎన్నికల సంఘం కు, జిల్లా కలెక్టర్ ట్రాన్స్ జెండర్లు కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్ జెండర్స్ కలెక్టరేట్ కార్యాలయంలో క్యాంటీన్ ఏర్పాటు చేసుకుంటామని, రేషన్ కార్డ్స్ మంజూరు చేయాలని, మహిళా సంఘాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి మరియు ఈడి ఎస్సీ కార్పొరేషన్ లక్ష్మీనారాయణ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నరేష్, జిల్లా సంక్షేమ అధికారి నరేష్ , మెప్మా శ్రీనివాస్ గౌడ్ ఫీల్డ్ ,ఆఫీసర్ కొండయ్య సీనియర్ అసిస్టెంట్ చంద్రమోహన్ , మహిళ శిక్షణ కోఆర్డినేటర్ నవ్య, ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

# మధుయాష్కీకి వ్యతిరేకంగా పోస్టర్లు

**హైదరాబాద్ - ప్రభాత సూర్యుడు**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ప్రచార కమిటీ ఛైర్మన్ మధుయాష్కీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యాలయంలో పోస్టర్లు వెలిశాయి. గాంధీభవన్ గోడలపై అతికించిన ఈ పోస్టర్లు ఇప్పుడు ఆ పార్టీలో తీవ్ర కలకలం రేపుతున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్బీనగర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసేందుకు మధు యాస్కీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో మధుయాష్కీకి టికెట్ ఇవ్వొద్దంటూ పోస్టర్లు అతికించడం చర్చనీయాంశంగా మారింది. మధుయాష్కీని ఉద్దేశిస్తూ 'గో బ్యాక్ టు నిజామాబాద్.. పారాచూట్ నాయకులకు టికెట్ ఇవ్వొద్దు' అంటూ పోస్టర్లపై పేర్కొన్నారు.సేవ్ ఎల్బీ నగర్ అంటూ పోస్టర్లు వేయడంతో కలకలం రేగింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక కోసం ఇటీవల కాంగ్రెస్ పార్టీ దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో ఎల్బీ నగర్ సీటు కోసం మధుయాస్కీ దరఖాస్తు చేసుకున్నారు. ఎల్బీనగర్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు పోటీగా మధుయాస్కీ దరఖాస్తు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎల్బీనగర్ నియోజక వర్గంలో బీసీ ఓటర్లు అధికంగా ఉండటంతో గెలుపు సులువు అవుతుందనే ఉద్దేంతో మధుయాస్కీ గౌడ్ ఉన్నారు.ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో ఉన్న ఎల్‌బి నగర్‌లో 2014లో తెలుగుదేశం పార్టీ తరపున ఆర్ కృష్ణయ్య గెలిచారు. బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓటమిపాలయ్యారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విజయం సాధించారు. బీఆర్ఎస్ నుంచి బరిలో ఉన్న ముద్దగోని రాంమోహన్ గౌడ్ ఓడిపోయారు. గెలిచిన కొద్దిరోజులకే సుధీర్ రెడ్డి కూడా కారెక్కారు.సుధీర్ రెడ్డి పార్టీ మార్పు తర్వాత? ఇక్కడ మల్ రెడ్డి రంగారెడ్డి సోదరుడు మల్ రెడ్డి రాంరెడ్డి పార్టీ వ్యవహారాలను చూస్తున్నారు. స్థానిక నేతగా పేరున్న స్థానిక నేతగా పేరున్న జక్కిడి ప్రభాకర్ రెడ్డి యాక్టివ్ గా పని చేస్తున్నారు. పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అనేక కార్యక్రమాలు చేస్తున్నారు. ఈసారి టికెట్ తమదే అన్న ధీమాలో ఇద్దరు నేతలు ఉన్నారు. అనూహ్యంగా పార్టీకి చెందిన సీనియర్ నేత మధుయాస్కీ గౌడ్ దరఖాస్తు చేసుకోవడంతో పోటీ నెలకొంది.మధుయాస్కీ గతంలో నిజామాబాద్ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2014, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీ అభ్యర్థి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. నిజామాబాద్ నుంచి మళ్లీ పోటీ చేసే విషయంలో డైలామాలో పడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఏదైనా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించారు. ఇందులో భాగంగానే?. ఎల్బీ నగర్ నియోజకవర్గానికి ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఎల్బీ నగర్ టికెట్ బరిలోకి మధుయాష్కీ రావడంతో ఆయన ప్రత్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇందులో భాగంగానే గాంధీ భవన్‌లో పోస్టర్లు వెలిసినట్లు చెబుతున్నారు.

# ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ




**కుత్బుల్లాపూర్- ప్రభాత సూర్యుడు :** ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన మహనీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ అని నవసమాజ నిర్మాణానికి పునాది ఉపాధ్యాయులేనని కుత్బుల్లాపూర్ పరిధిలోని సుచిత్ర బ్రాంచ్ నారాయణ పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జె హేమలత అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయుల ఘనతను ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, మంచి విద్యాబుద్ధులతోపాటు క్రమశిక్షణ గల వ్యక్తులుగా సమాజానికి భావి భారత పౌరులను అందిస్తున్న వారు ఉపాధ్యాయులేనని ఆమె అన్నారు. పదవ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల వస్త్రాదరణలో వచ్చి ఒకరోజు ఉపాధ్యాయుల పాత్ర పోషించారు. ఏజీఎం పురుషోత్తం రెడ్డి కోఆర్డినేటర్లు అంబికా దీప్తి కిరణ్ కుమార్ డీన్ సాయి ప్రకాష్ పిఇటి శేఖర్ ఏఒ చంద్రశేఖర్ ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దీర్ఘకాలిక రోగుల కోసం ఆలనా

(మొదటి పేజీ తరువాయి)

బాధపడుతున్న రోగులందరికీ ఉచిత పాలియేటివ్ కేర్ సౌకర్యాలు అందేలా చూడాలని ఆరోగ్య అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇలాంటివారిని ఆదుకునేందుకు తెలంగాణ సర్కార్ ఆలన కేంద్రాల ద్వారా అన్ని సేవలు అందిస్తుంది. కుటుంబ సభ్యులకు భారం కాకుండా.. కేంద్రాల్లో వారికి అన్ని రకాల చికిత్సలు అందిస్తున్నారు. అన్ని విధాలుగా బాధితులకు సాంత్వన చేకూర్చడమే ఆలన కేంద్రాల ప్రధాన విధి.వీటిలో వైద్యుడితోపాటు, ఫిజియోథెరపిస్టు, స్టాఫ్ నర్సులు, ఆయాలు ఉండనున్నారు. 365 రోజులు 24 గంటలపాటు వీరు అందుబాటులో ఉంటారు. తెలంగాణలోని అన్ని జిల్లా ఆసుపత్రుల్లో క్యాన్సర్ వంటి చివరి దశ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు పాలియేటివ్ కేర్ సౌకర్యాలు రానున్న నెలల్లో వాస్తవం కానున్నాయి. వారికి ఉచిత వసతి, భోజనం, మందులు, ఫిజియోథెరఫీ తదితర సేవలు అందుబాటులో ఉంటాయి.ప్రతి పాలియేటివ్ కేర్ ఫెసిలిటీలో ఒక వైద్యుడు, 5 నర్సులు, ఒక ఫిజియోథెరపిస్ట్, ఒక డ్రైవర్, 5 మంది నాన్–క్లినికల్ సిబ్బంది రోగులను, రోజువారీ కార్యకలాపాలను చూసేందుకు ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఒక్కో ఉచిత పాలియేటివ్ కేర్ సౌకర్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 30 లక్షల నుంచి రూ. 35 లక్షల వరకు ఖర్చు చేస్తోంది.ఆసుపత్రి ఆవరణలో ఉన్న పాలియేటివ్ కేర్ సౌకర్యాలు ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, హోమ్ కేర్ సేవలను అందిస్తాయి. సంరక్షణను సులభతరం చేయడానికి.. ప్రొవైడర్లు రోగుల ఇళ్లకు ప్రయాణిస్తారు. కొన్ని సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ హోమ్ కేర్ యూనిట్స్ గా పిలువబడే 17 మొబైల్ వ్యాన్‌లను ప్రారంభించింది.

# ప్రెసిడెంట్ ఆఫ్ భారత్.. జీ20 ఇన్విటేషన్‌పై వివాదం

(మొదటి పేజీ తరువాయి)

భారత్‌గా గుర్తిస్తూ ఇన్విటేషన్‌ను ప్రచురించడం సంచలనంగా మారింది. జీ20 దేశాధినేతలతో పాటు ముఖ్యమంత్రులకు సెప్టెంబర్ 9వ తేదీన విందు ఇవ్వనున్నారు. ఓ అధికారిక కార్యక్రమానికి ఇన్విటేషన్‌పై ప్రెసిడెంట్ ఆఫ్ భారత్ అని రాయడం ఇదే తొలిసారి అని అధికారులు చెబుతున్నారు. భారత్ అన్న పదం మన రాజ్యాంగంలో ఉందని అధికారులు తెలిపారు. ఇండియా లేదా భారత్, ఆర్టికల్ 1 ప్రకారం యూనియన్ ఆఫ్ స్టేట్స్‌గా గుర్తిస్తారు. విదేశీ ప్రతినిధులకు అందజేసిన జీ20 బుక్‌లెట్‌లోనూ భారత్ అన్న పదాన్ని వాడారు. ప్రజాస్వామ్యానికి భారత్ తల్లి లాంటిదని, వేల ఏండ్ల నుంచి ఇక్కడ సుసంపన్నమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతున్నట్లు ఓ బుక్‌లెట్‌లో రాశారు.రాష్ట్రపతి డిన్నర్ ఇన్విటేషన్ కార్డు లీకైన తర్వాత.. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ తన ట్వీట్‌లో హర్షం వ్యక్తం చేశారు. రిపబ్లిక్ ఆఫ్ భారత్ అని రాస్తూ.. మన నాగరికత ముందుకు వెళ్లడం గర్వంగా ఉందని అన్నారు. తాము అనుకున్నట్లే పేరు మార్చారని కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ విమర్శించారు.

ఇండియాను భారత్ అని పిలువాలని కొన్ని రోజుల క్రితం ఆర్ఎస్ఎస్ నేత మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. ఇటీవల విపక్ష పార్టీలు తమ కూటమికి ఇండియా అన్న పేరు పెట్టుకున్న విషయం తెలిసిందే. అయితే అప్పటి నుంచి ఇండియా, భారత్ అంశంపై వివాదం చెలరేగుతూనే ఉంది. ప్రపంచవ్యాప్తంగా మన దేశానికి ఇండియా అన్న గుర్తింపు ఉంది. అయితే గతంలో ఈ విశాల దేశాన్ని భారత్‌గా పిలిచేవారు.

# ఎన్నికల గ్రౌండ్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పినా?' అలకపాన్పు ఎక్కుతారామోనన్న భయం వెంటాడుతోంది. టిక్కెట్ దక్కిందనే ఆనందం కంటే? ఇప్పటి నుంచి పెట్టాల్సిన ఖర్చు చూస్తేనే నీరసం వస్తోందని నేతలు మథనపడుతున్నారు. జాబితా వచ్చి నెలరోజులు కాకముందే చోటా మోటా నేతలు, కార్యకర్తలను కాపాడుకునేందుకు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తుంటే..ఈనెలతోపాటు అక్టోబరు, నవంబరు నెలల్లో పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఊహించుకోవటానికే కష్టంగా ఉందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. వరసగా వినాయక చవితి, బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వస్తున్నాయి. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గాల్లోని ప్రతీ ఊరుకి గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పూజలు, ఊరేగింపులు, భజనల కోసం అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తుంది. ఇదే ఇప్పుడు వారిని మరింత కలవరపాటుకు గురి చేస్తోంది. 'ఎన్నికలు అయిపోయేంత వరకూ కార్యకర్తలు, నాయకులను చంటి పాపల్లా చూసుకోవాలి. ఏ ఒక్కరినీ చేజార్చుకోవద్దు. ఇగోలు, ప్రెస్టేజీలన్నింటినీ పక్కన పెట్టండి. అవసరమైతే మీకు వ్యతిరేకంగా ఉన్న వారి కడుపులో తలకాయపెట్టి మరీ బతిమాలుకోండి?' అంటూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్? అభ్యర్థులకు మొదటి నుంచీ చెబుతూ వస్తున్నారు. దీన్ని పాటించడానికి కోట్లు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందన్న ఆవేదనకు గురవుతున్నారు.

## తెలంగాణాలో రూ. 700 కోట్లను పెట్టుబడిగా పెట్టేందుకు ముందుకు వచ్చింది నాఫ్కో

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనకు కంపెనీ అంగీకారం తెలిపింది. ఈ ట్రైనింగ్ అకాడమీ ద్వారా దాదాపు 100కు పైగా దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న తమ సంస్థ నైపుణ్యాన్ని, అగ్నిమాపక శిక్షణను తెలంగాణ కేంద్రంగా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సంస్థ సీఈవో మంత్రి కేటీఆర్‌కు తెలియజేశారు.

# సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

### యూత్ కాంగ్రెస్ నాయకులు జిల్లా అధ్యక్షుడు జెమినీ గౌడ్



కమాన్‌పూర్- ప్రభాత సూర్యుడు

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పెద్దపల్లి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జెమినీ గౌడ్ అన్నారు.మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కమాన్ పూర్ మండలములోని అన్ని గ్రామ పంచాయతీలలోని పాఠశాలల్లో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేశారు. సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలకపాత్ర అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులందరికీ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కమాన్ పూర్ మండలంములోని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా కమాన్ పూర్ మండలంలోనీ గ్రామ పంచాయతీ కమాన్పూర్, గుండారం, జూలపల్లి, పెరపల్లి, గొల్లపల్లి, నాగారం పెంచికల్పేట్, సిద్దిపల్లె, రొంపికునీట గ్రామ పంచాయతీలో విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తూ, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి ఉపాధ్యాయులను శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రతి గ్రామంములోని కాంగ్రెస్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు గౌరవ ప్రజా ప్రతినిధిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెమినీ గౌడ్ , గానీడ్ల మోహన్, రంగు సత్యనారాయణ,పెండ్యాల రాజు, లల్లు,అఫ్సర్, బిల్లా వెంకటేష్ బిల్లా కృష్ణ మహేష్ రవి, శిలారపు మల్లయ్య , అంజి , నాగపూర్ అజయ్, మోండయ్య , రాజ్ సిలివెరి, శేవ్వా శంకరయ్య, ముస్తాఖ్ ఆకుల ఓదెలు ,జక్కుల శ్రీను, వడ్లకొండ మల్లేష్ రాచకొండ శ్రీనివాస్ విష్ణువర్ధన్, చొప్పరి శేఖర్ ఎరుగురాళ్ల శేఖర్, నునేటి మల్లికార్జున్, బొంగని సది, అన్నపూర్ణ అశోక్ ,కుక్క రవి ,పోతుల కుమార్ ,అబిగౌడ్,కటకనీ రవీందర్,కోల నరేందర్ సుమన్ ఉన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి

### అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ చేసిన సీపీ రాచకొండ



మేడ్చల్ - ప్రభాత సూర్యుడు

శాంతి భద్రతల పరిరక్షణ, సిబ్బంది పనితీరు సమీక్ష మరియు నేరాల అదుపు చర్యలలో భాగంగా రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి, ఉప్పల్, నాగోల్, ఎల్బీనగర్, మీర్పేట్, వనస్థలిపురం, అబ్దుల్లాపూర్మెట్, సరూర్నగర్, చైతన్యపురి పోలీస్ స్టేషన్లను కమిషనర్ డిఎస్ చౌహాన్ సోమవారం అర్ధరాత్రి అకస్మాత్తుగా సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్లో రాత్రిపూట విధుల్లో ఉన్న సిబ్బంది, పెట్రోల్ కార్లు మరియు బ్లూ కోల్ట్స్, కానిస్టేబుల్ మరియు ఇతర స్థాయిల అధికారుల పనితీరు పరిశీలించారు. అన్ని వేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. రాత్రి పూట విధుల్లో మరింత శ్రద్ధగా పనిచేయాలని, తద్వారా స్మగ్లింగ్ వంటి వివిధ రకాల అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకోవచ్చని తెలిపారు. రాత్రి పూట పని చేసే ఉద్యోగులు, మహిళలు మరియు ఇతరులకు ఎటువంటి వేదింపులు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అత్యవసర సహాయం కోసం వచ్చే ఫోన్ కాల్స్ కు తక్షణమే స్పందించి, బాధితులకు సత్వర న్యాయం అందించాలని పేర్కొన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది సమర్థవంతంగా పని చేసేలా మానిటర్ చేస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్లకు సంబంధించిన వెహికల్ చెకింగ్ పాయింట్స్ లను సందర్శించి ఎలాంటి అవాంఛనీయ కార్యక్రమాలు జరగకుండా చూడాలని, గంజాయి స్మగ్లింగ్ ను అరికట్టాలని సిబ్బందికి సూచించారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే దాసరి



**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు:** గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. మండలంలోని తుర్కల మద్దికుంట గ్రామంలో ఒక కోటి 15 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలోని ఎల్లమ్మ గుడి వద్ద గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభించారు. గ్రామంలోని నూతనం గా భూ లక్ష్మీ - మహాలక్ష్మి మరియు పోచమ్మ గుడి నిర్మాణాని కి స్వంతంగా 3 లక్షల 50 వేల రూపా యల అందచేసి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా పనిచేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలా గ్రామాలు అభివృద్ధి చెందకపోగా వాటిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు ధ్యేయంగా ఒక గ్రామానికి కోటి 15 లక్షల కేటాయించడం అనేది చాలా గొప్ప విషయం అన్నారు.

# 15న కట్టుదిట్టంగా టెట్ పరీక్షల నిర్వహణ

### జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా

- భూపాలపల్లి లో 2599 అభ్యర్థుల కోసం 6 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జయశంకర్ భూపాలపల్లి - ప్రభాత సూర్యుడు



సెప్టెంబర్ 15న జిల్లాలో టెట్ పరీక్ష నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్నారు. మంగళవారం ప్రగతి భవన్ లో టెట్ పరీక్ష నిర్వహణ పై జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా మాట్లాడుతూ టెట్ పరీక్షల నిర్వహణ కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. సెప్టెంబర్ 15న ఉదయం 9.30 గంటల నుంచి 12 గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు రెండవ పేపర్ ఉంటుందని కలెక్టర్ అన్నారు. టెట్ పరీక్షల కోసం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో 6 పరీక్షా కేంద్రాలుప్రభుత్వ జూనియర్ కళాశాల సంఘమిత్ర పిజిడి డిగ్రీ కాలేజ్ శ్రీ చైతన్య పీజీ డిగ్రీ కాలేజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తేజస్విని( గాంధీ) జూనియర్ కళాశాల జిల్లా ప్రజా పరిషత్ ప్రభుత్వ పాఠశాల లో ఏర్పాటు చేసామని ఉదయం నిర్వహించే మొదటి పరీక్షకు 1421 మంది అభ్యర్థులు, మధ్యాహ్నం నిర్వహించే రెండవ పరీక్షకు 1178 మంది అభ్యర్థులు హాజరవుతున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేయాలని, పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేయాలని అన్నారు. ప్రశ్న పత్రాల తరలింపు, పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఫస్ట్ ఎడ్ కిట్, ఓఆర్ఎస్ ప్యాకెట్ల ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారికి కలెక్టర్ సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద త్రాగునీటి సౌకర్యం ఉండే విధంగా ఉండాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, పరీక్షా కేంద్రాల వద్దకు బస్సులు ఏర్పాటు చేయాలని, నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని అన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం ప్రహరి గోడల వద్ద సైతం భద్రత ఏర్పాటు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పేపర్ లీకేజి సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు , అదనపు అదనపు ఎస్పీ రమేష్ , సంబంధిత జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన రైతుకు రుణమాఫీ అందేలా చర్యలు

### రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు

వ్యవసాయ శాఖ, బ్యాంకర్లతో రుణమాఫీ సమస్యల కోసం గ్రీవేన్స్ వ్యవస్థ ఏర్పాటు



**పెద్దపల్లి- ప్రభాత సూర్యుడు :** అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణశ్రీ జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి రైతు రుణమాఫీ, ఆసరా ఫించన్, కారుణ్య నియామకాలు, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి , జీఓ 59 వంటి పలు అంశాలపై మంత్రి తన్నీరు హరీష్ రావు జిల్లా కలెక్టర్ లకు పలు సూచనలు చేశారు. ఈ సమావే శంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శ్రీధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, సిపిఓ రవీందర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ఈ విభాగం సూపరిండెంట్ పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

# అవకాశం ఇచ్చిండ్లు అభివృద్ధి చేసి చూపించా

### జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్

**మంథని- ప్రభాత సూర్యుడు :** ఆనాడు నాలుగేండ్లు ఎమ్మెల్యేగా, ఈనాడు జెడ్పీ చైర్మన్‌గా అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపించామని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. మంగళవారం మంథని పట్టణంలోని రాజగృహాలో కమాన్‌పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపూర్ గ్రామానికి చెందిన సుమారు వంద మంది బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా పుట్ట మధు మాట్లాడుతూ ఆనాడు ఎమ్మెల్యే ఉన్న సమయంలో రాజాపూర్ వాసులు అనేక పనులు కావాలని తన దృష్టికి తీసుకువచ్చారని, గుడి కావాలని, మంగపేట రోడ్డు కావాలని కోరడంతో ఆనాడు రూ.3కోట్ల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అయితే సమయం సరిపోక ఆ పనులు ఇంకా పూర్తి కాలేదన్నారు. ఆ తర్వాత మంథని నియోజకవర్గ ప్రజలు అన్నం పెట్టటోళ్లను వద్దని చెంచడు నీళ్లు పోయనోళ్లను గెలిపించుకున్నారని ఆయన వాపోయారు. తాను అధికారంలో ఉన్నప్పుడు అనేక పనులు చేసినా తనను వద్దనుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆలోచన చేయకుండా మాయమాటలునమ్మి ఓట్లేయడం మూలంగా అభివృద్ధిలో ఐదేండ్లు వెనుకబడిపోయామని ఆయన అన్నారు. తాను మంథనిలో కట్టించిన ఇంటిలో తాను లేకపోతే తన సతీమణి అందుబాటులో ఉంటుందని, ఇద్దరం లేకపోతే మా పీఏ అందుబాటులో ఉంటూ మీ సమస్యలు తెలుసుకుంటారని, అంతేకాకుండా మా ఇంటిలో ఎంత సమయమైనా ఉండే అవకాశం ఉంటుందే కానీ సారు ఇంట్లో నిమిషమైనా ఉండనిస్తారా అని ఆలోచన చేయాలన్నారు. మన ఆకలి, కష్టాలు తీర్చాలని ఏనాడు ఆలోచన చేయరని, ఎలా కుట్రలు, కుతంత్రాలు చేయాలే ప్రజలను ఎలా దూరం చేయాలనే ఆలోచన చేయడం, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి రావడమే వాళ్ల లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు గొప్పగా ఆలోచన చేసి మన కోసం ఆలోచన చేసే వారికి అండగా నిలువాలని, ఓటు వేసే ముందు ఆలోచించి ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# లక్ష్యంతో చదివితే విజయం వరిస్తుంది



**పెద్దపల్లి - ప్రభాత సూర్యుడు:** ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాల పెద్దపెల్లి సెమినార్ హాల్లో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జేఎన్టీయూ కొండగట్టు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ సతీష్, మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్ హాజరై విద్యార్థులను వారి భవిష్యత్తు గురించి వివరించారు. అతిథులు మాట్లాడుతూ విద్యార్థుల కు ఉజ్వల భవిష్యత్తు అందించడం కొరకు ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్ గత 40 సంవత్సరాలుగా విద్యార్థుల జీవితాలు స్థిర పడేలా చేస్తుందని .. క్రమశిక్షణతో చదివి ఉద్యోగ అవకాశాలు పొందాలని కోరారు. ప్రొఫెసర్ సతీష్, శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హీలీ ఫ్రీక్వెన్సీ థెరపీ కేంద్రం ప్రారంభం

మంథని- ప్రభాత సూర్యుడు



మంథని పట్టణంలోని రాఘవులు నగర్లో మంత్రపురి ఫ్రీక్వెన్సీ థెరపీ హెల్త్ కేర్ సెంటర్ ను ప్రముఖ వైద్యులు, సీనియర్ ఫ్రీక్వెన్సీ థెరపీస్టు ఒటైం వేవర్ నిపుణులు డాక్టర్ ఎస్ బి రవి నారాయణ ప్రారంభించారు.అనంతరం తమ్మి చెరువు కట్ట వీధిలోని శ్రీ జానకీ రామ కళ్యాణ మంటపం లో ఏర్పాటు చేసిన సెమినార్ లో డాక్టర్ ఎస్. బి.రవి నారాయణ మాట్లాడుతూ వ్యాధి ఏదైనా అనారోగ్య లక్షణాలు ఏవైనా సైన్స్ ఆధ్యాత్మికతతో మిళితమై అన్ని రకాల శారీరక, భావోద్వేగ, ఆధ్యాత్మిక రుగ్మతలను దూరం చేయడానికి . "హీలీ" అనే వైద్య పరికరం వెనుక ఉన్న సైన్స్ మరియు టెక్నాలజీని వివరించారు. ఫ్రీక్వెన్సీ థెరపీ ద్వారా చికిత్స అందించే విధానం హీలీ అంటే ఏమిటి,హీలీ సైన్స్ ఏమిటి, హీలీ మన ఆరోగ్యం శ్రేయస్సుకు ఏవిదంగా సహాయ పడుతుంది అన్న విషయాల గురించి సభికులకు వివరించారు. అదేవిధంగా హీలీ ఈ రోజు ప్రపంచంలోనే నంబర్ ఓన్ వెల్నెస్ పరికరంగా ఎలా మారింది,ప్రతి ఇంటిలో హీలి ఉండటం వల్ల కలిగే లాబాలు ఎమిటి అన్న అంశాలపై కూడా సభలో చర్చించారు. అనంతరం సభికులు అడిగిన పలు అనారోగ్య సమస్యలకు హీలీ ఫ్రీక్వెన్సీ థెరపీ చికిత్స విధానం పై పలు సందేహాలను నివృత్తి చేశారు.మంథని ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం మంథని లో ఏర్పాటు చేసిన "మంత్రపురి హీలీ ఫ్రీక్వెన్సీ థెరపీ హెల్త్ కేర్ సెంటర్" ఉచిత సేవలను వాడుకొని ప్రతి ఒక్కరూ చికిత్స పై అవగాహన పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెమినార్ నిర్వాహకులు ఇనుముల సతీష్, ఉప్పట్ల శ్రీనివాస్, బడికెల నర్సయ్య, పి.శ్రావణ్, రావికంటి సతీష్,ఎం.రవీందర్ రావు, సిలివేరి కిషన్,రమేష్ లతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ 57 ఉపకులాలకు దళిత బంధు అందేలా చూడాలి



మంథని - ప్రభాత సూర్యుడు

ఎస్సీ 57 ఉపకులాలకు దళిత బంధు అందేలా చూడాలని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధుకు ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం ఆదేశాల మేరకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బాణాల రాజా రామ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గడ్డం మారుతి ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ ను కలిసి విన్నవించారు . ఎస్సీ 57 ఉప కులాలు ప్రభుత్వ పథకాలు అందక దారిద్ర రేఖకు దిగువన దీవిస్తున్నారని ప్రభుత్వం ప్రవేశపెట్టే దళిత బంధు పథకంతో పాటు అన్ని సంక్షేమ పథకాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం కుమార్, ముత్తారం మండల అధ్యక్షులు గడ్డం భూషణం, గడ్డం శ్రీహరి, గడ్డం రవీందర్, గడ్డం శ్రీనివాస్, గడ్డం శివ, గడ్డం శంకర్, గడ్డం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్- ప్రభాత సూర్యుడు

సోమవారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా అన్ని స్థాయిల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్, వాటర్ వర్క్స్ ఎండి దాన కిషోర్, ట్రాన్స్ కో ఎండి, జి?లా కలెక్టర్ తో మంత్రి మాట్లాడారు. మంత్రి మాట్లాడుతూ ప్రజలు ఎక్కడ కూడా ఇబ్బందులకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడ నీరు నిలిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. చెట్లు, కొమ్మలు కూలిన చోట నుండి వెంటనే తొలగించాలి. హుస్సేన్ సాగర్, ఉస్మాన్ సాగర్ వాటర్ లెవెల్స్ ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి. నాలాల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ జరపాలి. ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలి. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలి. అత్యవసర సేవలకు జీహెచ్ఎంసి కంట్రోల్ రూమ్ 21111111, 23225397 ను సంప్రదించాలని సూచించారు.

Printed, Published and Owned by CHERUKU UPENDAR, Printed at Akshaya Printers, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, EDITOR CHERUKU UPENDAR, PUBLICATION at HAMSA PUBLICATIONS, H/No: 7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR, ABDULLAPURMET MANDAL, HAYATH NAGAR, PIN:501505, RANGAREDDY DISTRICT/ HYDERBAD CITY, TELANAGANA, E-mail: upendrabbk@gmail.com, RNI:TELTEL12215